మాయమాటల ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి

● నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వెలగొండలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఆర్ఎస్పీ, అభిలాష్‌రావు

చిన్నంబావి, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించి మాయమాటలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలగొండ గ్రామంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావుతో కలిసి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుకగా నన్ను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపించాలని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 24గంటల కరెంట్, రుణమాఫీ, రైతుబంధు, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం లేదు కానీ ప్రజలకు మాయమాటలు చెప్ప మంటే కాంగ్రెసోళ్లు మస్తు చెప్తారని అలాంటి కాంగ్రెస్ మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శరత్‌రెడ్డి, సంకటి మద్దిలేటి, ఈశ్వరయ్య, రాజు, అంజి, ప్రకాశ్, శేఖర్, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

● పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

తెల్లరాళ్లపల్లిలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్, మే 6 : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే దేశాభివృద్ధి సాధ్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి తండా, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో మంత్రి జూపల్లి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవిని గెలిపించాలని సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కాంగ్రెస్ భావజాల పార్టీలన్నీ ఏకమై పోరాటం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, మాజీ జెడ్పీటీసీ రవి, మాజీ ఎంపీపీ వెంకటేశ్‌నాయుడు, నాయకులు గోవర్ధన్‌సాగర్, మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మయ్య, బాల్యానాయక్, రాజునాయక్, వాల్మీకి తదితలు పాల్గొన్నారు.

పోలీస్ ప్రజావాణికి 5 ఫిర్యాదులు

వనపర్తి టౌన్, మే 6 : జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 5 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రక్షితామూర్తి తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఆమె మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. భూ ఫిర్యాదులు 3, పరస్పర గొడవల ఫిర్యాదులు 1, భార్యాభర్తల ఫిర్యాదులు 1 మొత్తం 5 ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు.

విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

గద్వాల అర్బన్, మే 6 : పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ ఈవీఎంల శిక్షణలో అవగాహన పెంచుకొని ఎన్నికల విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎంఏఎల్‌డి కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన ఈవీఎంలపై అవగాహన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవో , ఓపీవోల పాత్ర చాలా కీలకమని, ఈవీఎం వాడకంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. పీవోలు, ఏపీవోలు ఇతర పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రానికి డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలను పోలింగ్ సామగ్రిని తీసుకువెళ్లేటప్పటి నుంచి తిరిగి అప్పగించే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్లు, పీవోలు, ఏపీవోలు, పోపీవోలు ఉన్నారు.

బాధిత కుటుంబానికి రావుల పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

కొత్తకోట, మే 6 : కొత్తకోట పట్టణానికి చెందిన రాచాల జనార్దన్‌గౌడ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్, సడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, వసీంఖాన్ ఉన్నారు.

ధరూర్ మండలంలో..

ధరూర్, మే 6 : మండలంలోని భీంపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మేకల రాంరెడ్డి సోమవారం ఉదయం దవాఖానలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని రాంరెడ్డి మృతిదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు విజయ్, ఉరుకుందు, హన్మంత్, వంశీ తదితరులు ఉన్నారు.

హైలెవల్ వంతెన పనులు పూర్తి చేయాలి

అయిజ, మే 6: పట్టణంలోని పెద్దవాగుపై నిర్మిస్తున్న నాలుగు లైన్ల హైలెవల్ వంతెనతోపాటు పులికల్ డబుల్ రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేయాలని అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు కోరారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లోని ఏవో భద్రప్పకు వినతిపత్రం అందజేశారు. జూలైలో పనులు ప్రారంభమై ఆరునెలల్లో పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ వంతెన పనులు పూర్తికాకపోవడంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలుగుతుందని ఏవో దృష్టికి తెచ్చారు. హైలెవల్ వంతెనతోపాటు పులికల్ డబుల్ రోడ్డు పనులు పూర్తి చేస్తే మూడు రాష్ట్రాలకు రవాణా మెరుగుపడుతుందని వివరించారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఏవో భద్రప్ప అఖిలపక్ష కమిటీ నాయకులకు వివరించారు. కార్యక్రమంలో అయిజ అఖిలపక్ష కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

హామీలను పక్కకు పెట్టి..కేసీఆర్‌ను తిట్టడమే పని

● కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం
● పెబ్బేరు మండలంలో ఎన్నికల ప్రచారం



రంగాపూర్‌లో ఉపాధి కూలీలతో మమేకమైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

రోడ్‌షోలో నిరంజన్‌రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెబ్బేరు, మే 6 : ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కేసీఆర్‌ను తిట్టడమే పనిగా ప్రజాపాలన కొనసాగుతోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం పెబ్బేరు మండలం రంగాపురంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించి..చెరువులో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీల వద్దకెళ్లి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం తప్పా వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని చెప్పారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో..ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లొస్తే ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి వాటిని అమలు చేసే బాధ్యత తమదని ఆయన భరోసా ఇచ్చారు. ఇంత వరకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానం నుంచి స్థానికేతరులే ఎన్నికవుతూ వస్తున్నారని.. ఇప్పుడు బీఆర్ఎస్ స్థానికుడైన ప్రవీణ్‌కుమార్‌ను బరిలోకి దింపిందని తెలిపారు. ఆయనను గెలిపిస్తే మన సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కరిస్తాడని నిరంజన్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి పద్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్, నాయకులు రాజశేఖర్, కృష్ణారెడ్డి, వేణురెడ్డి, గోవింద్‌నాయుడు, మజీద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలి

పెద్దమందడి, మే 6 : తెలంగాణ రాష్ట్రంలో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని బలిజపల్లి, జంగమాయిపల్లి జంట గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పదేండ్లుగా కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. నాలుగు నెలల్లో అన్ని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి ఉచిత బస్సు ప్రయాణం తప్పా ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చని పరిస్థితి కాంగ్రెస్ పార్టీదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఓటేసి పార్లమెంట్‌కు పంపిస్తే ఈ ప్రాంత సమస్యలతో పాటు రాష్ట్ర సమస్యలను కూడా పార్లమెంట్‌లో మాట్లాడే శక్తి ఆర్ఎస్పీకి ఉందని, ఉన్నత విద్యావంతుడైన ఆర్ఎస్పీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తిరుగబడుతున్నారని, ఈ ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఏ పనులు చేయకున్న కానీ ప్రజలు మాపైపే ఉన్నారని చెప్పుకుంటారని, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లాంటి వ్యక్తులు ఉంటే నిలదీయవచ్చునని అన్నారు. అందుకని ఆర్ఎస్పీని భారీ మెజార్టీని ఇచ్చి ఆయనను పార్లమెంట్‌కు పంపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుయాదవ్, మాజీ ఎంపీపీ మన్యపురెడ్డి, రాజాప్రకాశ్‌రెడ్డి, సింగిల్‌విండో ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, శశివర్ధన్‌రెడ్డి, కొండలు, నాగేంద్రయాదవ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

వనపర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

వనపర్తి, మే 6 : పట్టణంలోని 32వ వార్డు కేడీఆర్ నగర్‌లో కౌన్సిలర్ నాగన్నయాదవ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ కారుగుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యావంతుడు,మేధావి వర్గానికి చెందిన వాడన్నారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర నాయకులు చిలుక సత్యం సాగర్, వెంకటయ్య, జ్ఞానేశ్వర్, నందిమల్ల గోపి, శివరాజ్ పాల్గొన్నారు.

బుద్ధారంలో ఇంటింటి ప్రచారం

గోపాల్‌పేట, మే 6 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బుద్ధారంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, బిళ్లకంటి రాజు, సురేశ్, ఎండీ ఖదీర్, లక్ష్మయ్య, సిద్ధి రాములు, ఆంజనేయులు, నాగేంద్రం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు, మే 6 : పెబ్బేరు పట్టణంలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారాన్ని కొనసాగిస్తోంది. పట్టణ పార్టీ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు వార్డుల్లో పర్యటిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని కోరుతున్నారు. సోమవారం ప్రచారంలో నాయకులు మేకల ఎల్లయ్య, సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎస్పీని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

పాన్‌గల్, మే 6: నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతుబంధు మాజీ మండల కన్వీనర్ వెంకటయ్యనాయుడు అన్నారు. మండలంలోని దవాజీపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలకు మోసపోవద్దు

కొత్తకోట, మే 6 : కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ప్రజలు మోసపోవద్దని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. మండలంలోని అమడబాకుల గ్రామంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కనిమెట్ట గ్రామంలో ఎంపీపీ గుంతమౌనిక , సంకిరెడ్డిపల్లి గ్రామంలో సీడీసీ చైర్మన్ చెన్న కేశవరెడ్డి, పట్టణంలో 6,4 వార్డుల్లో మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, అయ్యన్న, రాములుయాదవ్, ఖాజామైనుద్దీన్, అద్వాని శ్రీను, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

ఉండవెల్లి, మే 6: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం ఉండవెల్లి మండల కేంద్రంలో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీశ్రేణులు ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమలు చేసిన పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుంకన్న, రాజశేఖర్, నాయకులు దామోదర్‌రెడ్డి, రజాక్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్
● పీవో, ఏపీవోల శిక్షణ తరగతుల పరిశీలన

పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వనపర్తి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

పీవో, ఏపీవోలకు సూచనలిస్తున్న గద్వాల కలెక్టర్ సంతోష్

ఎర్రవల్లి చౌరస్తా, మే 6: పీవో, ఏపీవోలు ఎన్నికలను పారదర్శకంగా జరిగేవిధంగా చూడాలని జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్ తెలిపారు. ఎర్రవల్లి చౌరస్తా ఏకశిల పాఠశాలలో పీవో, ఏపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ సోమవారం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాంచందర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన పీవోలు, ఏపీవోలు పోలింగ్‌బూత్‌ల్లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహణ చేపట్టాలని సూచించారు. కేంద్రంలో పాటించాల్సిన నియమాలు, ఈవీఎం కనెక్షన్ సరిగ్గా చేయాలని, కంట్రోల్ యూనిట్ వీవీప్యాడ్‌లను సీల్ చేయడం, ఈవీఎం, వీవీప్యాడ్స్‌ల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ ప్రారంభం కంటే 90నిమిషాలముందు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్‌ను చేపట్టాలని ఏజెంట్లు మాక్‌పోల్‌కు హాజరుకానప్పుడు 15నిమిషాలు అగి లేనిపక్షంలో మైక్రోఅబ్జర్వర్‌కు సమాచారం ఇచ్చి స్టార్ట్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాంచందర్, తాసీల్దార్లు ధరణి, నరేంద్ర, మంజుల, హరికృష్ణ, శ్రీనివాస్ జోషి, ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర

వనపర్తి, మే 6 : పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్రే కీలకమైనదని కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అధికారులను పేర్కొన్నారు. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పీవో, ఏపీవోలకు ఎన్నికల నిర్వహణ, ఈవీఎంలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సోమవారం సందర్శించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడం చాలా ముఖ్యమైనదన్నారు. పోలింగ్ స్టేషన్‌లో అన్ని పరిస్థితులను అదుపులోకి తీసుకోవాల్సిన బాధ్యత పీవో, ఏపీవోలదేనన్నారు. ఈవీఎంల నిర్వహణలో ఏమైనా అనుమానాలు ఉంటే ఇక్కడే మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు ఏమైనా ఇబ్బందులు వస్తే వెంటనే సెక్టోరియల్ అధికారులకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 19మంది అభ్యర్థులు పోటీల్లో ఉండటంతో రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయని, ఈవీఎంను ఎలా అనుసంధానం చేయాల్లో ఒకటికి రెండుసార్లు ఇక్కడే శిక్షణలో తెలుసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో మొత్తం 389మంది పీవో, ఏపీలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తూడి ఎన్నికల ప్రచారం

గోపాల్‌పేట, మే 6 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి ని గెలిపించాలని కోరుతూ సోమవారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఎన్నికల ప్రచారం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటేసి, కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంద భార్గవి, నాయకులు సత్యశీలారెడ్డి, పర్వతాలు, అచ్యుతారామారావు, శివన్న, సురేశ్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

పురిటిలోనే పసికందు మృతి

● వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల నిరసన
● డాక్టర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బండ్ల

గద్వాల అర్బన్, మే 6: పురిటిలోనే పసికందు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సోమవారం చోటు చేసుకున్నది. బాధితుల కథనం ప్రకారం గట్టు మండలం బోయలగూడెం గ్రామానికి చెందిన సుజాత పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. ప్రసవ సమయంలోనే పసికందు మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాధితులు పసికందు మృతికి కారణం వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆరోపించారు. 1వ తేదీన దవాఖానకు వస్తే వైద్యులు ఇంకా ప్రసవ నొప్పులు రాలే..అప్పుడే ఎందుకు వచ్చావ్ అని స్కానింగ్ తీసుకొని రావాలంటూ బాధితులకు సమాధానం చెప్పి పంపించారు. మళ్లీ 3వ తేదీన దవాఖానకు వస్తే వైద్యులు పట్టించుకోకుండా కాలాయాపన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసవ సమయంలో మృతి చెందిందని సులువుగా చెప్పి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని దవాఖాన బయట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దవాఖానకు చేరుకొని నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలతో దవాఖానకు వచ్చినప్పుడు తక్షణమే స్పందించి చికిత్స నిర్వహించాలి తప్పా...నిర్లక్ష్యంగా వ్యవహరించకుడదని హెచ్చరించారు. ఈ విషయంపై దవాఖాన సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్‌ను వివరణ కోరగా మహిళకు రక్త పోటు అధికంగా ఉండటంతో పురిటిలోనే శిశువు మృతి చెందిందని సమాధానం తెలిపారు.

ఫిర్యాదుపై తక్షణమే స్పందన

గద్వాల అర్బన్, మే 6 : ఫిర్యాదుదారులు తమ సమస్యలను నిర్భయంగా పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పరిశీలించి పోలీస్ అధికారులు చట్ట ప్రకారం పరిష్కరిస్తారని ఎస్పీ రితిరాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించగా ఐదు ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ తెలిపారు.

విద్యావంతుడిని గెలిపించుకుందాం

చిన్నంబావి, మే 6 : ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపర్చిన ఎంపీ అభ్యర్థి , విద్యావంతుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ వెంకట్రామమ్మ ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం కొప్పునూరులో ఇంటింటి ప్రచారం అనంతరం ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు తగరం లక్ష్మి, మేకల రవీందర్ ఉన్నారు.

జీపీ కార్మికుడిపై చర్యలు తీసుకోవాలి

మదనాపురం, మే 6 : ఎన్నికల నిబంధనలను అతిక్రమించి పార్టీ తరపున ప్రచారం చేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు ట్రాక్టర్ డ్రైవర్ చిన్న రాములుపై చర్యలు తీసుకోవాలని దంతనూరు గ్రామస్తులు తాసీల్దార్ అబ్రహం లింకన్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తూ పార్టీ తరపున ప్రచారం చేయకూడదని పలుమార్లు హెచ్చరించినా వినకుండా కండువా కప్పుకొని ప్రచారం నిర్వహిస్తున్నాడని వినతిలో పేర్కొన్నట్లు తెలిపారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ రాములు ఎన్నికల నిబంధనలు ఉల్లఘించిన మాట వాస్తవమని, వివరణ ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మండల కోడ్ కండక్ట్ మండల ఇన్‌చార్జి... ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ శివానంద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లామని, వారి ఆదేశాల మేరకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్, నరేందర్ ఉన్నారు.

నిరంతర విద్యుత్‌కు ప్రత్యేక బృందాలు

వనపర్తి, మే 6 : జిల్లా కేంద్రంలో వేసవి దృష్ట్యా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.రంగనాథరాయ్ ప్రత్యేక బృందాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఈ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండ తీవ్రత వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా నిరంతర విద్యుత్ అందించేందుకు ప్రత్యేకంగా మండలస్థాయిలో 15 బృందాలను, సబ్ డివిజన్‌లకు ఇద్దరు చొప్పున డీఈలను నియమించినట్లు తెలిపారు. రెండు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామని, దీనితో 24 గంటల